టి. శ్రీవల్లీ రాధిక

# ఆస్తి

శ్రీరాములు నాకు మొదటిసారి కనబడినపుడు సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రుడిలాగే గోచరించాడు.

ఆరు నెలల క్రితం వరకూ అతనెవరో నాకు తెలీదు. ఇపుడు మాత్రం.. అతనూ, అతని రిక్షా లేకపోతే నాకు ఒక్కరోజైనా గడవదు.

నేను పని చేస్తున్న ఆఫీస్ మాయింటినుంచి సరిగ్గా మూడు కిలోమీటర్లు. ఈ దూరానికి అటు బస్సులూ లేవు. ఇటు ఆటోలూ రావు.

ప్రొద్దున్నే అమూల్యమయిన టైంలో మరీ అమూల్యమయిన పదిహేను నిమిషాలూ మిగుల్చుకోవాలంటే యిక ఒక్కటే మార్గం. రిక్షా.

దానికోసమే అన్వేషణ మొదలుపెట్టాను.

దురదృష్టవశాత్తూ మాఏరియాలో రిక్షాలు తక్కువ. ఉన్న నాలుగైదు రిక్షాలూ కూడా సిమెంటుబస్తాలు మోసేందుకు మాత్రమే వుపయోగపడుతున్నాయి.

వాళ్ళు ఎంత డబ్బు యిస్తామన్నా మనుషులని తీసుకెళ్ళడానికి ఒప్పుకోరు. ఒకవేళ ఒప్పుకున్నా సిమెంటులో ముంచి తీసినట్లుండే ఆ రిక్షాలో ఎక్కి ఆఫీసుకి వెళ్ళడం అసంభవం.

అదిగో అలాంటి విపత్కర పరిస్థితుల్లో కనిపించింది శ్రీరాములు రిక్షా.

ఎంత అందమైన రిక్షా అని అది! ఎండలో తళతళా మెరుస్తూ .. మువ్వలు గలగలలాడించుకుంటూ వయ్యారంగా అది నాకు ఎదురు పడినపుడు రోడ్డు మధ్యలో దానికి అడ్డం పడి నాకష్టం చెప్పుకున్నాను.

"కాస్త రా నాయనా! ఇక్కడ వుండేవాడివేగా! .." అంటూ నేను బ్రతిమలాట మొదలుపెట్టగానే శ్రీరాములు అభయహస్తం చూపిస్తూ నవ్వాడు.

తలగుడ్డ తీసి, సీటు శుభ్రంగా తుడిచి.. దానిమీద ఆప్యాయంగా ఒక దెబ్బ వేసి "ఎక్కండమ్మగారూ!" అన్నాడు.

నాకు కలో, నిజమో అర్థం కాలేదు. పైపెచ్చు అవసరాన్ని గమనించి ఎక్కువ డబ్బులు అడగకుండా న్యాయంగా అడగడం మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

అదిగో.. ఆరోజనుంచీ ప్రతిరోజూ ప్రొద్దున్నే ఎనిమిదీ యాభై అయ్యేసరికి వాకిట్లో రిక్షా గంట టంచనుగా వినిపిస్తోంది.

నేను పరుగెత్తుకుంటూ వచ్చి అందులో కూర్చోవడమే ఆలస్యం. ట్రాఫిక్‌తోనూ, వాతావరణంతోనూ సంబంధం లేకుండా తొమ్మిదికి రెండు నిమిషాలుండగానే నన్ను ఆఫీసుకి చేరుస్తాడు శ్రీరాములు.

అలా అతను నాకు దేవుడయ్యాడు.

ఆ రిక్షా అంటే అతనికి ఎంత ప్రేమో పెద్ద గమనింపు లేని వాళ్ళకి కూడా అర్థమవుతుంది. దాన్ని పట్టుకోవడంలోనూ, తుడవడంలోనూ, త్రొక్కడంలోనూ వాడు చూపించే జాగ్రత్త చూస్తే నాకు చాలా ముచ్చటేసేది. ఇంత మోటుగా కనిపించే వీడిలో ఎంత సున్నితత్వం వుందీ అనిపించేది.

మెచ్చుకునే హృదయం వుండాలి కానీ ప్రతివారిలోనూ ఏదో ఒక గొప్పతనం వుంటుంది. ఆఫీసులో నా దగ్గర పనిచేసే సీతాలక్ష్మి అంతే. అదయితే నిజంగా ఒక నవలా నాయికే.

దాని అందం.. పెద్ద పెద్ద కళ్ళూ.. ఒంపైన ఒళ్ళూ.. యివన్నీ ఒక ఎత్తు. దాని మాటలూ.. తెలివితేటలూ.. పనీ ఒక ఎత్తు. అది అద్దాలు తుడిచి వెళ్ళిందంటే ఇక అక్కడ అద్దం వుందని మనకు నమ్మబుద్ధి కాదు. మధ్యలో ఏమీ లేనంత స్పష్టంగా అద్దానికి అవతల వున్నవి కనిపిస్తూంటాయి.

పనిలో పడిందంటే దానికిక ఏ ధ్యాసా వుండదు. ఒకరోజు నేను ఏదో వ్రాసుకుంటూ మధ్యలో చిన్న సందేహం వచ్చి తల ఎత్తాను. కిటికీ అంచు

మీదికెక్కి అద్దాలు తుడుస్తున్న సీతాలక్ష్మి కనిపించింది.

నేను వ్రాత సంగతి మర్చిపోయి దాని అందాన్నీ, వయ్యారాన్నీ చూస్తూ కూర్చున్నాను. అలా తుడుస్తూనే అది ప్రక్కకి తిరిగింది. అప్పుడు కనిపించాయి నడుము మీదా, వీపు మీదా రెండు భయంకరమయిన వాతలు.

"ఏమిటవి!" అన్నాను నేను కలలోనుంచి మేల్కొన్నట్లుగా. అది ఉలిక్కిపడి నావైపు చూసింది.

"వీపు మీద ఆ వాతలేమిటి!" అన్నాను.

చిన్నగా నవ్వి మొహం త్రిప్పుకుంది. "కొట్టిండు" చాలా సాధారణంగా వినిపించింది ఆమె గొంతు.

"ఎవరూ!" అన్నాను అయోమయంగా.

"ఇంకెవరు కొడ్తరు మేడమ్! మా ఆయన."

"ఎందుకూ!" అన్నాను నేను చాలా ఆవేశంగా. అనుసంధానంగా మాటలు వెతుక్కుంటుంటే సీతాలక్ష్మి గొంతు తడబాటు లేకుండా వినిపించింది.

"మొగోడు కొట్టేదానికి కారణమెందుకు మేడమ్! ఆడికి బలముంది. కొడ్తడు. అంతే."

నేను ముందే చెప్పాగా! దాని మాటలు ఆ స్థాయిలోనే వుంటాయి. అవి అర్థం చేసుకుని నేను మళ్ళీ మాట్లాడబోయేసరికి తను అక్కడ లేదు. ప్రక్కరూంలో అద్దాలు తుడవడానికి వెళ్ళిపోయింది.

సంవత్సరం క్రిందటి మాట యిది. అప్పట్నుంచీ ప్రొద్దున్నే సీతాలక్ష్మి రాగానే పరీక్షగా చూడటం అలవాటయ్యింది నాకు.

దెబ్బ కనపడటం ఆలస్యం "కొట్టాడా!" అనేదాన్ని ఆవేశపడిపోతూ.

మొదట్లో "ఇదెక్కడి గోలరా!" అన్నట్లుగా చూసేది. వివరాలడిగినా చెప్పేది కాదు. ఆతర్వాత మెల్లమెల్లగా తన గంభీరత వదిలించుకుని సమాధానాలు చెప్పడం మొదలు పెట్టింది.

"ఎందుకు వూరుకుంటావు సీతాలక్ష్మీ! కొట్టద్దని చెప్పవా!" అంటే..
"నే చెప్పాల్నా మేడమ్మా.. కొట్టమని నేనడిగినానా చాలని చెప్పనీకి! ఆ బుద్ధి ఆడికి వుండాలిగానీ" అనేది.
"నిజమే కదా!" అని నేను నాలిక కరుచుకునేదాన్ని.
కానీ ఆ విషయాన్ని మాత్రం నేను తేలికగా తీసుకోలేకపోయాను. "అసలు ఒక మనిషి మరో మనిషిని కొట్టడమేమిటి! అందులోనూ భర్త భార్యని కొట్టడమేమిటి!
తనకన్నా ఎన్నో మెట్లు పైన వున్న నన్నే సీతాలక్ష్మి యింతగా ఆకర్షిస్తుందే! అలాంటిది ఆమె భర్త యింకెంత అపురూపంగా చూసుకోవాలి!"
ఈ ఆలోచనలు నన్ను చాలా తీవ్రంగా వేధించేవి.
రోజు మొత్తంలో నేను కాస్తంత స్థిమితంగా కూర్చునేది శ్రీరాములు రిషాలోనే. అందుకే రిషా ఎక్కడం ఆలస్యం.. రకరకాల ఆలోచనలు నా మనసును చుట్టేసేవి.
"శత్రువులయితే పోలీస్ కంప్లయింట్ యిస్తాం. బయటివాళ్ళయితే నోటికొచ్చిన శాపనార్థాలన్నీ పెడతాం. వాళ్ళ సర్వనాశనాన్ని కోరుకుంటాం.
మరి మొగుడు కొడితే ఏం చేయాలి! ప్రేమించడం కాకుండా యింకేం చేయాలి! "ఆడు సుఖంగా వుండాలి" అనుకోవడం కాకుండా యింకేం చేయాలి!
చదువుతోనూ.. కులంతోనూ.. ఆర్థికస్థాయితోనూ సంబంధం లేకుండా మగవాడిలో ఈ మొరటుతనం ఎందుకు వుంటుంది!
పురుషులలో యింతమంది కళాకారులూ.. మేధావులూ వున్నారు కదా!
గొంతులో శతకోటి గమకాలు పలికించే గానగంధర్వులూ.. వ్రేలికొనల్లో రకరకాల భావాలూ, వర్ణాలూ నిలుపుకున్న రచయితలూ..
చిత్రకారులూ వున్నారు కదా!

వాళ్ళనుంచి మిగిలిన వాళ్ళు కొంతైనా సున్నితత్వాన్ని ఎందుకు గ్రహించరు! అంతెందుకు! కళాకారులనే కాదు. రిక్షా తొక్కే శ్రీరాములు ఎంత సున్నితంగా ఆలోచిస్తాడు! . ."

ఈ రకంగా సాగేవి నా ఆలోచనలు.

శ్రీరాముల్ని "సిమెంటు బస్తాలు ఎందుకు తీసుకెళ్ళవు శ్రీరాములూ! ఎక్కువ డబ్బులు వస్తాయి కదా!" అని అడిగితే "రిక్షా పాడవుద్ది అమ్మగారూ!" అంటాడు.

తెలతెల్లగా సిమెంటు పడితే చిరాకేస్తదిట. అతనలా చెప్తుంటే నాకు తెలీని సంతోషం కలిగేది. అతని సున్నితత్వాన్నీ.. సీతాలక్ష్మి మొగుడి మొరటుతనాన్నీ పోల్చి చూడటం.. కొంతమంది అలా, కొంతమంది యిలా ఎందుకుంటారు అనుకుని వాపోవడం నా దినచర్యలో ఒక భాగమయిపోయింది.

అయితే శ్రీరాములు సున్నితత్వానికి ఆద్యంతాలు మాత్రం నాకిరోజే తెలిశాయి.

ఇవాళ ప్రొద్దున మామూలుగానే ఆఫీసుకి వచ్చాను నేను. రిక్షా దిగి లోపలికి వచ్చి, మెట్లెక్కుతూ అద్దాలలోనుంచీ గేటువైపు చూశాను.

అక్కడ రిక్షా వెనక్కి తిప్పుకుంటూ శ్రీరాములు కనిపించాడు. సీతాలక్ష్మి అతనితో ఏమిటో చెప్తోంది. అతను వినిపించుకోకుండా వెళ్ళిపోతున్నాడు.

కాసేపటి తర్వాత ఆమె నా గదిలోకి వచ్చింది, "సచ్చినోడు" అని తిట్టుకుంటూ.

సాధారణంగా అలాంటిమాటలు ఆమె నోటివెంట రావు. లేనిపోని పుకార్లు సృష్టించడం.. నోరుజారి ఒకర్ని తిట్టడం చేతకాని సీతాలక్ష్మి నోటివెంట యిలాంటి మాటా!

నేను ఆశ్చర్యపోతూ "ఎవర్ని తిడుతున్నావు!" అన్నాను.

"ఇంకెవర్నమ్మా! నా మొగుడ్ని. పిల్లాడికి పుస్తకాలు కొనాలంటుంటే యినిపించుకోకుండానే ఎల్తన్నాడు." అంది.

ఏదో అనుమానం మనసుని తొలిచేస్తుంటే "ఎవరూ! శ్రీరాములు.." అన్నాను నేను తడబాటుగా.

"ఆఁ. ఆడేనమ్మా. పిలుస్తుంటే పలక్కుండా పోయాడు." అంది.

"శ్రీరాములు నీమొగుడా!" జన్మలో ఎరగనంత ఉలికిపాటుకు గురవుతూ అడిగాను.

సీతాలక్ష్మి తలకాయ వూపి తన పనిలో మునిగిపోయింది కానీ నేను మాత్రం ఆ నిజాన్ని జీర్ణించుకోలేకపోయాను.

"రిక్షా తొక్కుతాడు.. బాగా మాట్లాడ్తాడు.. టైంకి వస్తాడే.. సిమెంటు బస్తాలు కూడా వేయడు.." అర్థం పర్థం లేకుండా మాట్లాడసాగాను.

నల్లటిమొహంలో తెల్లటి పలువరుస మెరిసేలా సీతాలక్ష్మి నవ్వింది.

"అవునమ్మా. సిమెంటు బస్తాలేస్తే రిక్షా పాడవుద్దని వేయడు. ఆరిక్షా అంటే ఆడికి ప్రాణం" అంది.

"మరి.. మరి ప్రాణంలేని రిక్షాని అంత ప్రేమగా చూసుకునేవాడు నిన్నింత మొరటుగా కొడ్తాడేంటి!" నాగొంతులో ఆవేశం కన్నా ఆశ్చర్యమే ఎక్కువగా ధ్వనించింది.

"బలే వున్నావు మేడమ్మా.." సీతాలక్ష్మి అక్కడినుంచి వెళ్ళిపోతూ అంది.

"రిక్షా, నేనూ ఒకటేనా! అది ఆడు కొనుక్కున్న ఆస్తి."

అంతే. ఆ ఒక్కమాటే అంది ఆమె.

కానీ ఆ ఒక్కమాట నాకు జీవితమంతా గుర్తు పెట్టుకోవాల్సిన నిజాన్ని చెప్పింది.

అవును. రిక్షా లాగా భార్య కొనుక్కుంటే వచ్చే ఆస్తి కాదు. దొరికే ఆస్తి. ఈ ఆస్తి కోసం కష్టపడాల్సిన అవసరం లేదు. జీవితంలో ఎప్పటికీ ఆమె విలువ

తెలుసుకోవాల్సిన అవసరం లేదు. మరీ ముఖ్యంగా ఒకవేళ ఈ ఆస్తిని కోల్పోతే బాధపడాల్సిన అవసరం లేదు.

ఎందుకంటే ఎన్నిసార్లు దురుపయోగం చేసినా, ఎన్నిసార్లు కోల్పోయినా మళ్ళీ మళ్ళీ దొరికే ఒకే ఒక్క ఆస్తి భార్య.

అవును. భర్త భార్యని కొట్టడానికి కారణం సున్నితత్వం లేకపోవడం కాదు. ఆమె విలువ తెలియకపోవడం. భార్య అంటే అప్పనంగా వచ్చిన ఆస్తి అనే అభిప్రాయం నరనరంలోనూ జీర్ణించుకుని పోవడం.

నాకు ఈ విషయాన్ని యింత బాగా తెలియచెప్పిన శ్రీరాములు నిజంగా శ్రీరామచంద్రుడే.

త్రేతాయుగం నుంచీ నేటివరకూ మారని పతిదేవుల ప్రతినిధి.

ప్రాణం వున్న ఆస్తులుగా మిగిలిపోతున్న సీతమ్మల పెన్నిధి.

*****

("ఆకాశవాణి" - 1997)